

# చదువుకున్నమనిషి

-హాసన్

"చరి బాగా తగ్గింది" అతను అన్నాడు.

"అవును" అంది ఆమె.

ఫిబ్రవరి నెలలో ఒకానొక రాత్రి పది గంటలప్పుడు.

మబ్బులు లేని ఆకాశం ఎండిపోయిన ఎడారి భూమిలాగా వుంది. నక్షత్రాలు ఇసుక రేణువుల్లా మెరుస్తున్నాయి.

స్టేషన్ రోడ్డులో పక్క పక్కనే నడుస్తున్న వాళ్ళిద్దర్నీ రెండడుగుల దూరం వేరుచేస్తోంది.

మూసివున్న స్టేట్ బ్యాంక్ తలుపుల ముందు సెక్యూరిటీ గార్డు సిగరెట్టు వెలిగిస్తున్నాడు.

బ్యాంక్ ఎదురుగా రెండు టేకి చెట్లు తెల్లగా విచ్చుకున్న పూలతో ఆ మసక చీకట్లో విచిత్రంగా నిలబడి వున్నాయి.

ఇద్దరి మధ్య క్రమంగా గూడుకట్టుకుంటున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ, అతను చిన్నగా దగ్గాడు.

ఆమె తలతిప్పి అతని వైపు చూసింది. రహదారి బంగళాలోని లైట్లు ఆమె కళ్ళలో ఛమక్‌మని మెరిశాయి.

"ఎక్కడైనా జాబ్ చేస్తున్నారా?" అడిగింది ఆమె.

"లేదు" అన్నాడు.

అలా అంటున్నప్పుడు, అతని చూపులు రోడ్డు మీద వించి, ఎడమ చేతిలోని గోధుమ రంగు కవరు మీద ఒక్క క్షణం పాటు నిలిచాయి. అతని ఆలోచన ఆ కవర్లోని డిగ్రీ సర్టిఫికెట్ వైపు వానపాములా చిన్నగా కదిలింది.

"మీరో...?" అన్నాడు.

"నేనా!...చీరాలలో కాన్వెంట్ టీచర్ని..."

"రోజూ వెళ్ళి వస్తుంటారా?"

"ఊ...! ఇవాళ పాసింజర్ అందలేదు. లేకపోతే ఎనిమిదికే వచ్చేదాన్ని...ఇలా హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో రావడం మొదటిసారి. .

బాగా రాత్రయింది..." అంటూ గుర్తు రాకూడనిది ఏదో ఆ క్షణంలో గుర్తుకివచ్చినట్టుగా చట్టున మాటలు ఆపేసింది.

రెండు రిక్షాలు పోటీపడుతూ దాదాపు వీళ్ళని రానుకుంటున్నట్టుగా వెళ్ళాయి.

ఆమె చప్పున అతని వైపుకి జరిగింది. అతని చేతికి చీర చెంగైనా తగిలిందో? లేదో? సరిగా. తెలీలేదు.

"వెధవ రిక్షాలు..." అంటూ తప్పేమీ చేయని దానిమల్లే అతని ముఖంలోకి చూసింది.

"అవును" అన్నాడు అతను.

ఇద్దరూ మళ్ళీ నడవడం మొదలుపెట్టారు.

పక్కనే వున్న సినిమా హాల్లోంచి డ్యూయెట్

వివిపిస్తూ, ఆగిపోయి, అంతలోనే ఎవరో ఫైట్ చేసుకుంటున్నట్టుగా శబ్దాలూ, సంగీతం మొదలయ్యాయి.

దక్షిణపు గాలి వుండుండి విసురుగా వీస్తోంది.

ఉన్నట్టుండి "ఏంటన్నారూ...?" అని అడిగాడు అతను.

అతన్ని కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ!

"ఏమీ లేదు..." అంది ఆమె.

సద్దాం హుసేన్, గల్ఫ్ యుద్ధం, నక్సల్స్ కిడ్నాప్‌లూ, కూలిన కలలూ, ఓడిపోయిన జీవితాలూ, నిరుద్యోగం, దారిద్ర్యం...ఇన్ని వుంటే, ఏమీ లేకపోవడం ఏంటి? అర్థం లేకుండా అని అనిపించింది అతనికి.

"మీరు కూడా...చీరాల నించేనా?" అడిగింది ఆమె.

"కాదు...మరే...చిన్న అప్లికేషన్ ఫారం... హైదరాబాద్‌లో ఏదో కంపెనీలో ఖాళీలున్నాయని తెలిసింది...ఆర్.యమ్.ఎస్.లో పోస్ట్‌చేసి" పొడిపొడిగా అంటూ ఆమెవైపు ఒకసారి చూసి తలదించుకున్నాడు.

"ఎల్.ఐ.సి.లో ఉద్యోగాలున్నాయట. అప్లై చేయక పోయారా?" అంది ఆమె.

"ఏజ్ బార్ అయింది లెండి..."

నవ్వటానికి విశ్వప్రయత్నాలూ చేసి, చాతకాక, గొంతు సవరించుకున్నాడు అతను.

ఆమె చిన్నగా నిట్టూర్చిందేమో అనిపించింది.

శివరాత్రి కోసం శివాలయాన్ని సున్నాలూ అవీ కొట్టి-శుభ్రం చేస్తున్నారు. కొత్తగా కట్టిన ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్ మెట్ల మీద బిచ్చగాళ్ళూ, దిక్కులేని వాళ్ళూ నిద్రపోవడానికి ఉపక్రమిస్తున్నారు. లారీ ఆఫీస్ ముందు ఎవరో పెద్దగా అరుచుకుంటున్నారు.

అతను ఏదో చెప్పడానికన్నట్టుగా గొంతు సవరించుకున్నాడు. ఆమె తన చేతిలోని హేండ్ బ్యాగ్‌ని ఒకసారి చేత్తో తడిమి చూసుకుంది.

"ఇందాక, మీ నాన్న ఏం చేస్తారని చెప్పారూ" అని అడిగాడు.

అప్పటిదాకా వీస్తున్న గాలి ఎందుకో సంకోచిస్తున్నట్టుగా హఠాత్తుగా స్తంభించింది.

"మా నాన్నా? ఎలిమెంటరీ టీచర్‌గా చేసి రిటైర్ అయ్యారు. ఎందుకలా అడిగారు?" అంది.

తన మీదా, తన భవిష్యత్తు మీదా మనిషికి విశ్వాసాన్ని కలిగించగలిగినప్పుడే చదువు సార్థకమయ్యేది. అలాంటి చదువు మనిషిని ప్రయోజకుణ్ణి చేస్తుంది.

చదువుకుంటున్నప్పుడు జీవితం సరదాగా, సంతోషంగా వుండి, ఆ తర్వాత మోయలేని బరువుగా కనిపించిందంటే, ఆ చదువు జీవితానికి పనికిరాలేదనే అర్థం. అలాంటి చదువు మనిషిని అప్రయోజకుణ్ణి చేస్తుంది. చదువు జీవితానికి పనికిరాలేదని తెలుసుకోవడానికి చదువుకోవాలేమో అనిపిస్తే ... ఎంత విషాదకరం!

"ప్చ్...ఏం లేదు" అన్నాడు అతను.

ఇద్దరి మధ్యా ఒక విధమైన వ్యధాపూరిత వాతావరణం క్రమంగా బరువెక్కుతున్నట్టుగా అనిపించింది.

భావనారాయణ స్వామి గుడి, గాలి గోపురం మీద పావురాలు అరుస్తున్నాయి.

అ[illegible]తా బుక్ స్టాల్ అరుగుల మీద ఎవరో కూర్చుని చిన్నగా మాట్లాడుకుంటున్నారు.

రోజూ రాత్రిళ్ళు రోడ్ల మీద నిలబడి ఎవరో పోయినట్టుగా పెద్దగా ఏడుస్తుండే పిచ్చిది, నడిరోడ్డు మీద నిశ్శబ్దంగా నిలబడి వుంది.

అతనికి ఈ నడక గమ్యం లేకుండా ఎక్కడికో తీసికెళ్తున్నట్టుగా అనిపించింది.

చిత్రంగా-అదే క్షణంలో ఆమెకి కూడా సరిగ్గా అలాగే అనిపించింది.

రెండు వీధి కుక్కలు ఒకదాంతో ఒకటి పోట్లాడుకుంటూ, అతని దగ్గరగా వచ్చాయి. అతను కొంచెం ఉలికిపాటుతో, పక్కన ఆమెకి దగ్గరగా జరిగాడు. ఆ కుక్కలు అరుచుకుంటూ వెళ్ళిపోయాయి. అతను ఎప్పట్లాగానే దూరం జరిగాడు.

"భయపడ్డారా?" అడిగింది ఆమె.

ఆ మాటకి అతను వింతగా చూశాడు ఆమెని.

వీధి లైటు కాంతిలో ఆమె చెవికి ఊగుతున్న గిల్టు లోలకు క్షణం పాటు మెరిసింది.

"భయం...!!" తనలో తాను అనుకున్నట్టుగా చిన్నగా గొణిగాడు.

"బ్రతుకు కన్నా భయపెట్టేదీ, బాధపెట్టేదీ...ఈ లోకంలో వేరేదీ వుంటుందనుకోను..." అన్నాడు.

తర్వాత ఏదో ఆలోచిస్తూ రోడ్డు మీదకి చూపుల్ని నిలిపాడు.

అతనన్న ఆ మాటలకి ఆమె వెన్ను క్షణంలో వెయ్యో వంతు జలదరించింది. మెరుస్తున్న ఆమె కళ్ళలోంచి పొగలాంటి గతంలాగ, దుఃఖంలాగ, చేతులు మారి కనిపించని తీరంలోకి జారుకున్న జీవితంలాగా...ఏదో...మరేదో...విడివడి ఎక్కడికో వెళ్ళిపోయినట్టుగా అనిపించింది.

"జీవితం..." కసిగా అంది.

అతను ఆమె వైపు కళ్ళ చివర్ల నించి అనుమానాస్పదంగా చూశాడు.

తడి ఆరిపోయిన ఆమె కళ్ళు రగులుకుంటున్న నిప్పుల కుంపట్లలాగ మెరుస్తున్నాయి.

ఆమె తన చేతిలోని హేండ్ బ్యాగ్‌ని మళ్ళీ ఒకసారి తడిమి చూసుకుంది.

"నాన్న రిటైర్ అయి పదిహేనేళ్ళు దాటింది. తర్వాత వచ్చిన కాస్తా కూస్తా గ్రాట్యుటీని అక్కయ్య పెళ్ళి తినేసింది. చేతికి వచ్చే పెన్షన్ కనీసఅవసరాలకి కూడా సరిగా చాలదు. ధరలు చూశారుగా. ఎలా పెరిగిపోయాయో" అంది అతనివైపు చూస్తూ.

"అవును..." అన్నాడు.

"తమ్ముడేమో పదో క్లాసుకి వచ్చాడు. ఎదిగి వచ్చిన చెల్లెలు. మూడేళ్ళ క్రితం నాన్నకి పెరాలసిస్ వచ్చి కుడికాలూ, చెయ్యీ చచ్చుపడి పోయాక నాకీ టీచర్ పనిలో చేరడం...తప్పలేదు... అమ్మేమో పెళ్ళిళ్ళకీ, వాటికీ వంటలు చేస్తుంటుంది...నేనేమో ఇలా...మా నాన్నేమో అలా...పెళ్ళవగానే మమ్మల్ని మా దోవన వదిలి వెళ్ళిన మా అక్కయ్య సరేసరి...ఇంతే"

గొంతులో ఏదో అడ్డుకున్నట్లయి ఆమెకి పొలమారింది.

"మీరు ఎనభైలో ఇంటర్ చదివారు కదూ" అని అడిగాడు అతను.

"అవును...ఇంటర్‌తోటే ఆపేశాలెండి.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఆర్ట్సు కాలేజీలో చదివేటప్పుడు మీరు కూడా నాకు బాగా తెలుసు. డిగ్రీ పూర్తిచేశారా?''

''ఆ!...బి.ఎ....'' అంటూ చిన్నతనంగా, ఏదో తప్పుచేసినట్లుగా అనిపించి, తలదించు కున్నాడు అతను.

ఏదో కలలోకి వెళ్ళినట్లుగా-శిథిలమైన ఎప్పటి ఆనందాన్నో, జ్ఞాపకాల్నో మళ్ళీ అతి కష్టం మీద గుర్తుచేసుకుంటూ,

''అప్పటి రోజులు...బాగుండేవి...ఆ సరదా, స్నేహాలు, నవ్వులూ...ఏమీ తెలిసేది కాదు...'' అతని వైపు చూస్తూ అంది ఆమె.

''అవును'' అన్నాడు ఏ భావమూ లేకుండా అతను.

''మీరు...అప్పుడు బెస్ట్ స్పోర్ట్స్‌మెన్ కదూ. ముఖ పరిచయం వుంది కానీ ఎప్పుడూ మాట్లాడుకోలేదు మనం'' అంది ఆమె.

ఆ క్షణాన అతనికి హఠాత్తుగా మున్సిపాల్టీలో పనిచేసి రిటైరయిన కళ్ళు కనిపించని తండ్రీ, కిడ్నీ ట్రబుల్‌తో బాధపడే తల్లీ, పెళ్ళయిన రెండో నెల్లోనే తండ్రితో పేచీ పెట్టుకుని, ఈ ఊరి నించే ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళి పోయిన అన్నయ్య, మాటి మాటికీ డబ్బుల కోసం వచ్చే అక్కయ్యా, ఆమెని అలా పంపించే బావగారూ...గుర్తొచ్చారు.

కాసేపైనా ఆనందాన్నిచ్చే జ్ఞాపకాల్నీ, ఆలో చనల్నీ-ఊపిరి నిండా నింపుకోనీకుండా వీళ్ళందరూ ఇప్పుడే ఎందుకు గుర్తు రావాలి 'ఛీ' అనిపించింది అతనికి.

ఉన్నట్టుండి ఎడమ చేతిలో ఉన్న కవర్లో డిగ్రీ సర్టిఫికెట్ బరువుగా అనిపించింది.

దారి పక్కన కిళ్ళీ బంకు దగ్గర ఇద్దరు కుర్రాళ్ళు సిగరెట్ తాగుతున్నారు.

అతని నాలుక పీకినట్లయింది. సిగరెట్ ముఖం చూసి ఎన్నాళ్ళయిందో అనిపించింది.

ఆమె నడుస్తూనే హేండ్ బ్యాగ్‌ని ఒకసారి తడిమి చూసుకుంది.

ఆంజనేయస్వామి గుడి దగ్గర ఇద్దరు బిచ్చ గాళ్ళు చిల్లర డబ్బుల్ని లెక్కపెట్టుకుంటూ పంచుకుంటున్నారు.

అతడు - వాళ్ళ చేతుల్లో శబ్దం చేస్తున్న నాణాల వైపు అదోలాంటి కసితో, పగతో నిస్సహాయంగా చూశాడు.

అదే క్షణంలో ఆమె కూడా అలానే చూసి, అతడి ముఖంలోకి చూసి తల దించుకుంది.

అతను అప్రయత్నంగా పాంట్ జేబులో చెయ్యి దూర్చాడు. చేసీ చేసీ, కనీసం బంట్రోతు ఉద్యో గాన్నైనా పొందలేక, క్షణక్షణం చస్తూ, నిస్సహాయ నిరాశలో మెడ దాకా కూరుకుపోయి, 'జీవం' అనేది పూర్తిగా ఎండిపోయిన తన దౌర్భాగ్యపు జీవితం లాగా... జేబు కూడా ఖాళీగా బావురు మంది.

హోటల్ ముందు మెర్క్యురీ లైటు తెల్లగా వెలుగుతోంది.

ఎవరింట్లోంచో ''నన్ను చూసి నవ్వుకున్నా చిత్రమే అది చిత్రమే'' అనే పాట వినిపిస్తోంది.

ఆమెకి ఏదో గుర్తొచ్చినట్లయి-

''మీకు... పెళ్ళయిందా?'' అని అడిగింది.

''పెళ్ళా? నా బతుక్కి అదొక్కటే తక్కువ'' అతనన్నాడు.

అలా అంటున్నప్పుడు - గుండెని క్షణం పా... పట్టుకుని పిండేలాంటి నవ్వు అతని పెదాల మీద శోక గీతంలాగా నాట్యం చేసింది.

ఆమెకి ఎందుకనో తను వేసిన ప్రశ్నతనకే అసందర్భంగా అనిపించింది.

మళ్ళీ ఏదో అనబోయింది. ఆగిపోయింది. అనాలనుకున్న మాట ఆవులింతగా రూపాంతరం చెందింది.

''మీకు అయిందా?'' అతనడిగాడు. ఆ ప్రశ్న, సమాధానం ముందే తెలిసినప్పటికీ మొక్కుబడిగా అడిగే ప్రశ్న లాగా- ఒక రకంగా అతని గొంతులో ధ్వనించింది.

''పెళ్ళి... నేను కూడా పెళ్ళి చేసుకుని మా అక్కలాగా వెళ్ళిపోతే... మంచంలో వున్న నాన్న... పెళ్ళికెదిగిన చెల్లెలు... తమ్ముడు... అమ్మ... వీళ్ళు... వీళ్ళు....'' అంటూ మధ్య లోనే మాటలు ఆపేసింది.

అప్పుడు ఆమెకి భవిష్యత్ అంటే భరించలేని భయం, తన బతుకుని తరచి చూసుకుంటుంటే బాధ, దుఃఖం కలిగాయి.

కోర్టు బిల్డింగ్స్ చీకట్లోకి జారుకుంటు న్నాయి.

''జీవితం...'' పళ్ళు పటపటా కొరికాడు అతను.

నడుస్తూ వుంటే నాలుగు రోజుల్నించి మోకాలు నొప్పిగా వుంది. ఇరవై ఎనిమిదేళ్ళకే యవ్వనం శలవు తీసుకుపోతూ మిగులుస్తున్న కీళ్ళ నొప్పులేమో అనిపించింది.

అగ్రికల్చరల్ కాలేజీ వెనక నుంచి అర్ధ చంద్రుడు ఉదయిస్తున్నాడు.

దూరంగా ఎయిర్‌ఫోర్స్ ట్రక్ స్టార్ట్ అయి వెళుతోంది.

''మీది పర్మనెంట్ పోస్టేనా?'' అడిగాడు.

''పర్మనెంటా?... అయ్యో రామ. ఇది మూడో ఉద్యోగం...'' ఆమె పల్చగా నవ్వినప్పుడు తెల్లటి పలు వరస కనిపించింది.

''ఎక్కడన్నా జాబ్ కోసం ట్రై చేయక పోయారా''

''ఎక్కడా దొరకడం లేదు. ఎన్ని పరీక్షలు రాసి వుంటానో? ఒక్కటీ తగల్లేదు. ఈ ఊళ్ళో వుండడమే నేను చేసిన పాపం లాగుంది. ఎన్నా ళ్ళిలా ఈ రోడ్లని పట్టుకుని గబ్బిలంలా తిరగాల్సిన రాత రాసి పెట్టి వుందో?'' అన్నాడు అతను మెల్లగా, అతని గొంతులో అదో లాంటి విషా దంతో కూడిన సన్నటి జీర చిత్రంగా ధ్వనిం చింది.

''ఇక్కడ కాకపోతే... ఇంకెక్కడైనా... దేశంలో ఊళ్ళకేం తక్కువ.. చూడక పోయారా?'' అంది.

''ఎలా వెళ్ళమంటారు... అమ్మ... నాన్న... కళ్ళు కనిపించవు. కిడ్నీ ట్రబుల్... వీళ్ళని ఒంటరిగా వొదిలి...'' నిస్సహాయంగా అన్నాడు.

''ఓ!!... ప్చ్!!'' అంది.

''మీ ఇల్లెక్కడ?'' అడిగాడు.

''మాయ బజార్లో...'' అంది ఆమె.

ఆమె తల మీద స్ట్రీట్ లైట్ల కాంతి పడి మెరుస్తోంది.

''మరి...'' అంటూ ఆగిపోయాడు.

ఆమె అతని వైపు చూస్తూ.. ''ఏమిటి?'' అంది.

''ఏం లేదు... ఏదో మర్చిపోయాను'' అన్నాడు చీకట్లోకి చూస్తూ.

ఆమె చేతిలోని హేండ్ బ్యాగ్‌ని ఒకోసారి తడిమి చూసుకుంది.

''ఆ బ్యాగ్‌లో ఏముంది?'' అడిగాడు.

''మా నాన్నకి దగ్గు మందు''

కుడివైపుకి అడ్డ రోడ్డు వచ్చింది.

ఆమె రోడ్డు మధ్యలో ఆగింది.

''మా ఇల్లు ఇటే... నేను వెళ్తాను... మీరో?...'' అంది.

''నేనా?... నేను...'' అతనికి ఏం చెప్పాలో తోచలేదు.

రోజు రోజుకీ క్షీణించి, హీనమైన స్థితిలోకి జారుకుంటున్న ఇంటి పరిస్థితులు. ఎడారి లాంటి జీవితంలో ఎండమావిలా ఎంతకీ చేరువ కాని ఉద్యోగం. రోజు రోజుకీ చిక్కటి చీకటి లాగా అల్లుకుపోతూ కబళిస్తున్న దుర్భర దారిద్ర్యం... నయా పైసా సంపాదన లేని ఇన్నేళ్ళ జీవితం... అన్నీ అతని కాళ్ళలో సన్నటి మేఘాల్లాగా అటూ

100% ఫలితాలను సాధిస్తున్న
ఆదర్శగురుకుల విద్యాసంస్థలు
1991-92 సం॥ నకు
అడ్మిషన్లు జరుగుచున్నవి.
స్థాపితం: 1962
ఫోన్: 32084

శ్రీవిద్యావిహార్
SRI VIDYA VIHAR
PUBLIC SCHOOL
తెలుగు మీడియం
ENGLISH MEDIUM
లలితానందనగర్ (నవభారత్ గెస్ట్‌హౌస్ దగ్గర)
రింగ్‌రోడ్, గుంటూరు-522 006
ఇంకనూ కోరుకొండ సైనిక స్కూలు, నవోదయ పాఠశాలలు, పబ్లిక్ స్కూళ్ళ స్కాలర్‌షిప్ పరీక్షలు, డెహరాడూన్ మిలటరీ స్కూలు రాష్ట్ర గురుకుల పాఠశాలల పరీక్షలకు ప్రత్యేక శిక్షణ!
ప్రశాంత వాతావరణము
బాలబాలికలకు ఇంటిని
మరపించే హాస్టలు వసతి
PRAGATHI
నర్సరీ నుండి 10వ తరగతి వరకు.
స్థానికులకు బస్ సౌకర్యం కలదు.
శ్రీవిద్యావిహార్
కాంపోజిట్ రెసిడెన్షియల్
జూనియర్ కాలేజి
లలితానంద నగర్.
(నవభారత్ గెస్ట్‌హౌస్ దగ్గర)
రింగ్‌రోడ్, గుంటూరు-6

ఇటూ కదిలాయి.

గొంతు పెకిలించుకుని... "ఇటువైపు... నేరుగా..." అని మాత్రం అనగలిగాడు.

"నేనువెళ్తున్నాను. మళ్ళీ ఎప్పుడైనా కలుద్దాం లెండి" తల దించుకుని ఆమె మట్టి రోడ్డులోకి దిగింది.

అతనక్కడే నిలబడిపోయాడు.

ఆమె దూరంగా.., వెళుతూ వెళుతూ... ఒకసారి వెనక్కి తిరిగి చూసి అలాగే వెళ్ళి పోయింది.

ఇప్పుడు ఇంటికెళ్ళి చేసేదీ, చేయగలిగేదీ ఏమీ కనిపించలేదు.

అతను సూర్యలంక రోడ్డులో నడక కొన ... చాడు.

రైస్ మిల్లు, అడితీలు దాటాడు. అలాగే ఆలోచిస్తూ, నడుస్తూ రెండు వంతెనలూ, ముత్తాయపాలెం ఎప్పుడు దాటాడో??

ఏదో ప్రకాశవంతమైన నక్షత్రం ఆకాశంలో నడి నెత్తి మీదికి వచ్చి మెరుస్తోంది.

అతను ఎం.ఇ.ఎస్. గేటు కూడా దాటాడు.

సముద్రపుగాలి విసురుగా కొడుతోంది.

ఉప్పు గాలికి అతని ముఖం జిడ్డుగా తయారయింది.

గట్టు మీద గెస్ట్‌హౌస్‌లో లైట్లు వెలుగుతున్నాయి. బయట రెండు పోలీసు జీపులూ, ఒక మోటార్ సైకిల్ ఆగి వున్నాయి. లోపల్నించీ పెద్దగా నవ్వులూ, మాటలూ వినిపిస్తున్నయి.

అతను గట్టు దిగి సముద్రం వైపుకదిలాడు.

అతని చేతిలోని కవరులోకి సముద్రపు గాలి దూరి శబ్దం చేస్తోంది.

ఒడ్డు వరకూ నడచి అలలు తీరాన్ని తాకే చోట కాళ్ళు రెండూ బారచాపి ఆకాశంలో చూస్తూ కూచున్నాడు.

సముద్రం హోరుమని శబ్దం చేస్తోంది.

అలానే కూచున్నాడు. ఎంతసేపయిందో తెలీదు. తెల్లవారుజాము రెండో లేక మూడు గంటలో అయి వుంటుంది.

పక్కనే ఎవరో పిలిచినట్లయి, అతడు పక్కకి తిరిగి చూశాడు.

ఎవరో ఒంటి మీద గోచీపాతతో నిలబడి వున్నాడు.

"ఎవరయ్యా నువ్వు.. ఈ ఏళప్పుడు... ఈడేం పని?" అంటున్నాడు తనతో.

"నాకా... ఏమీ లేదు" అతనన్నాడు.

"ఏమీ లేదా? మరి ఈడెందుకున్నా" ఒక క్షణంఆగాడు.

ఏదో ఆలోచించి "ఓ పని చేత్తావేంది? ఒక మనిషి తగ్గాడు. పడవలో వస్తావా? నీకేం భయం లేదులే.నీ పనల్లా వలల్లో సేపల్ని ఏరి కుప్పలు పెట్టడమే... ఏంది వస్తావా? పదేను రూపాయ లిస్తాం. మద్దేన్నానికి వచ్చేయచ్చు... వస్తావా?" అంటున్నాడు.

అతనికి హఠాత్తుగా- ఇందాకటి పేరు గుర్తులేని అమ్మాయితో పరిచయం, నడక, మాటలు గుర్తొచ్చాయి.

అమ్మ, నాన్న, తుపాను తాకిడికి శిథిలమయిన పూరింటి లాంటి కుటుంబం, భగ్నమైన కలలు, ఆశలు... దోసిట్లో నీళ్ళ లాగా జారిపోతున్న కాలం... అన్నీ గొర్తొచ్చాయి.

అతను లేచి నిలబడ్డాడు.

చేతిలోని కవరు గరగరమంది.

ఎవరో ఆరేడు మంది పల్లె మనుషులు పడవని సముద్రంలోకి నెడుతున్నారు.

"ఒక చెయ్యేయ్" అన్నాడా పల్లె మనిషి.

అతను కూడా పడవని సముద్రంలోకి నెట్టడంలో సాయపడ్డాడు.

"ఎక్కు ఎక్కు" అంటూ ఎవరో తొందర చేశారు.

అతడు పడవ ఎక్కుతుండగా చేతిలోని కవరు జారి నీళ్ళలో పడిపోయింది.

"అరెరె" అన్నారు మిగతావాళ్ళు.

"తడిసిపోక ముందే బయటకి తియ్యి వయ్యా... అసలు... పనికొచ్చేదేనా?" అంటున్నారు ఎవరో.

పైకి లేస్తున్న పెద్ద అలని చూస్తూ,

"ప్చ! ఎందుకూ పనికి రాదు. దాన్నలా పోనీ" అన్నాడు అతను.

గోధుమ రంగు కవరు నీళ్ళలో కాసేపు తేలి, చిన్నగా మునిగిపోయింది.

తీరాన్ని వదిలిపెట్టిన పడవ సముద్రంలోకి సాగిపోతూ వుంది.

అలలు ఇంకా తీరానికి తలలు బాదుకుంటునే వున్నాయి.

అతనెక్కిన పడవ మాత్రం... తూర్పు వైపు... సముద్రం లోకి వెళ్ళిపోతూ వుంది. ●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్